WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036, 9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 219 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 4 ఆగస్టు 2025 | వెల : 2-00

# బాపట్ల జిల్లాలో ఘోరం

- క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతి
- మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు
- ప్రమాద సమయంలో క్వారీలో 16మంది పనిచేస్తున్నట్లు సమాచారం.
- ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం మాట్లాడారు
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి
- ఈ ఘటనపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ



స్వర్ణసాగరం బాపట్ల

జిల్లాలోని బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో ప్రమాదం చోటు చేసుకుంది. క్వారీ అంచు విరిగిపడి ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. మృతులను ఒడిశా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో క్వారీలో 16మంది పనిచేస్తున్నట్లు సమాచారం. వెంటనే అప్రమ త్తమైన అధికారులు క్వారీలో సహాయక చర్యలు చేపట్టారు. బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగటం సర్వసాధారణం అయిపోయింది. క్వారీల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న - మిగతా3లో



## అన్నీ గుర్తు పెట్టుకుంటాం

- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు
- కనీసం కాలువల్లో గుర్రపు డెక్క కూడా తీయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంది
- కాలువలో గుర్రపు డెక్క ప్రభుత్వం తొలగించాలి
- ప్రభుత్వానికి చేతకాకపోతే గుర్రపు డెక్క తొలగించడానికి రైతులకు అవకాశం ఇవ్వాలి



## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో భారత్ ప్రభంజనం

- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో భారీ వృద్ధి
- గతేడాదితో పోలిస్తే 58 శాతం పెరిగి 7.72 బిలియన్ డాలర్లకు చేరిక
- మొత్తం ఎగుమతుల్లో సింహభాగం యాపిల్ ఐఫోన్లదే
- దాదాపు 78 శాతం వాటాతో యాపిల్ హవా
- పీఎల్ఐ పథకం విజయంతో స్థానిక తయారీకి ఊతం
- భారత్ నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో స్మార్ట్‌ఫోన్లు టా

2

## ఉత్తరప్రదేశ్‌లో వరదలు




- రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు..
- ప్రమాద స్థాయిని దాటిప్రవహిస్తున్న పలు నదులు
- నీట మునిగిన వందలాది గ్రామాలు
- ప్రయాగ్‌రాజ్‌లో 15 వేల ఇళ్లలోకి నీరు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

## ఏటీఎంలలో రూ. 500 నోట్లు బంద్?

- ఏటీఎంలలో రూ. 500 నోట్ల పంపిణీ నిలిపివేతపై ఫేక్ న్యూస్
- ఆర్‌బీఐ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కేంద్రం స్పష్టీకరణ
- రూ. 500 నోట్లు యథావిధిగా చెల్లుబాటు అవుతాయని వెల్లడి
- ఇలాంటి వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన
- గతంలోనూ ఇలాంటి ప్రచారాన్ని ఖండించిన ప్రభుత్వం

2

వైరల్ మెసేజ్‌పై కేంద్రం క్లారిటీ



ఏఐతో కొన్ని ఉద్యోగాలకు

## ముప్పు తప్పదు

- బిల్ గేట్స్ కీలక విశ్లేషణ
- సాధారణ కోడింగ్, టెలిసేల్స్ పనులను ఏఐ చేయగలదని తెలిపిన బిల్ గేట్స్
- సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను అధిగమించడానికి ఇంకా సమయం పడుతుందని వెల్లడి
- పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి ఉద్యోగాలకు ముప్పు తప్పదని అంచనా
- ఏఐ పురోగతి వేగం తనను చాలా ఆశ్చర్యపరిచిందని ఆయన వ్యాఖ్య

పెట్టుబడులపై జగన్ అండ్ కోవి

## అసత్య ప్రచారం

- మంత్రి సత్యకుమార్ ధ్వజం
- ఏపీ అసెంబ్లీ సమావేశాలకు జగన్ రావాలి
- వారి పార్టీ నేతలు లాగా తాము అవహేళనగా మాట్లాడం
- రప్పా రప్పా భాష మాట్లాడమని చెప్పుకొచ్చారు.
- జగన్ కూడా జైలుకు వెళ్లాల్సి వస్తోందని తెలిసే... సానుభూతి పొందాలని వైసీపీ నేతలు చూస్తున్నారు





యూపీలో ఘోర ప్రమాదం...

## కాలువలోకి దూసుకెళ్లిన కారు

- ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- సరయూ కాలువలోకి దూసుకెళ్లిన భక్తుల వాహనం
- ఈ ఘటనలో 11 మంది దుర్మరణం, నలుగురికి గాయాలు
- మృతుల కుటుంబాలకు సీఎం యోగి రూ. 5 లక్షల పరిహారం
- ప్రధాని మోదీ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటన

ఎల్వీ సుబ్రహ్మణ్యం ఏఐపై అవగాహన లేకుండా

# వ్యాఖిలు చేయడం బాధాకరం

- తిరుమలలో ఏఐ టెక్నాలజీ వినియోగంపై మాజీ ఈఓ ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యలు
- సుబ్రహ్మణ్యం కామెంట్స్‌పై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్ర స్పందన
- ఏఐపై అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్న నాయుడు
- గూగుల్, టీసీఎస్ సహకారంతో ఉచితంగానే టెక్నాలజీ అమలు చేస్తున్నామని వెల్లడి
- రెండు గంటల్లోనే సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించే ప్రయత్నం
- ఏఐని వదిలేయాలన్న సూచనను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టీకరణ

స్వర్ణసాగరంతిరుమల

శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతిష్ఠాత్మకంగా తీసుకురానున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై టీటీడీ మాజీ ఈఓ, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం తన అభిప్రాయాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. కేవలం కొన్ని గంటల్లోనే శ్రీవారి దర్శనం కుదరని పని అని, ఏఐ సాయంతో ఒక గంటలోనే స్వామి దర్శనం చేయించాలన్న ఆలోచనను టీటీడీ విరమించుకోవాలని ఎల్వీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై టీటీడీ ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడు తీవ్రంగా స్పందించారు. టీటీడీ ఈఓగా పనిచేసిన అనుభవం ఉన్న సీనియర్ అధికారి ఏఐ టెక్నాలజీపై సరైన అవగాహన లేకుండా ఇలా మాట్లాడటం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. సామాన్య భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్సులో గంటల తరబడి వేచి ఉండకుండా, కేవలం రెండు గంటలలోపే శ్రీవారి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో టీటీడీ పాలకమండలి ముందుకు సాగుతోందని నాయుడు వివరించారు. ఇందుకోసం గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల సహకారంతో అత్యాధునిక ఏఐ టెక్నాలజీని ఉచితంగానే వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. దాతల సహాయంతో చేస్తున్న ఈ బృహత్కార్యాన్ని వృధా అంటూ - మిగతా2లో



మా కలం - సామాన్యుడి బలం
RNI No : APTEL/2020/1596
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# ఎన్నికల ఎఫెక్ట్..
# 'తమిళనాట 6.5 లక్షల కొత్త ఓటర్లు'

**ఢిల్లీ:** ఓటర్ లిస్టు విషయంలో ఎన్నికల సంఘంపై ఇప్పటికే ప్రతిపక్ష పార్టీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం మరో బాంబు పేల్చారు. తమిళనాడులో ఏకంగా 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని చెప్పుకొచ్చారు. దీంతో ఓటర్ లిస్ట్‌పై కొత్త చర్చ మొదలైంది. బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడులో కూడా ఓటర్ల సంఖ్య పెరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం తెలిపారు. తాజాగా చిదంబరం ట్విట్టర్ వేదికగా.. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదంలో ఉండగా.. తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది. పెరిగిన ఓటర్లను శాశ్వత వలస కార్మికులు అని పిలిస్తే అసలైన వలస కార్మికులను అవమానించినట్లు



అవుతుంది. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లేకుండా చేసేందుకు ఓట్ల పెంపుదల జరిగింది. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోంది. రాష్ట్రాల ఎన్నికల విధానాలను మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోంది. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాల్సిందే' అని పిలుపునిచ్చారు. ప్రతి భారతీయుడికి శాశ్వత నివాసం ఉన్న ఏ రాష్ట్రంలోనైనా నివసించడానికి, పని చేయడానికి హక్కు ఉంది. అది స్పష్టంగా సరైనది. బీహార్ ప్రస్తుత ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న లక్షల మంది వ్యక్తులు రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు. కాబట్టి వారిని మినహాయించాలని ఎన్నికల సంఘం ఎలా నిర్ణయానికి వచ్చింది?. ఒక వ్యక్తి ఒక రాష్ట్రం నుండి శాశ్వతంగా వలస వెళ్లారు అని నిర్ధారణకు రాక ముందే, ప్రతి కేసుపై సమగ్ర విచారణ నిర్వహించకూడదా?. సామూహిక ఓటుహక్కుల తొలగింపు అనేది తీవ్రమైన సమస్య, అందుకే సుప్రీంకోర్టు పిటిషన్లను విచారిస్తోంది' అంటూ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే చిదంబరం తన పోస్టుకు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి.

# దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కేంద్రం గుడ్‌న్యూస్..
# 35 రకాల మందుల ధరలు తగ్గిస్తూ నిర్ణయం..!

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం భారీ ఊరట కల్పించింది. దేశవ్యాప్తంగా 35 రకాల మందుల ధరలను తగ్గించింది. దేశ ప్రజలకు ప్రజలకు మందులను మరింత అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న 35 ఔషధాల రిటైల్ ధరలను తగ్గించింది. ఈ ఒంటినొప్పులు, గుండెసంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. దాంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కలుగన్నుది. ఈ మేరకు రసాయనాలు-ఎరువుల మంత్రిత్వ శాఖ ఈ ఉత్తర్వుల ను మేరకు జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్-డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్-పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులున్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్-పారాసెటమాల్-ట్రైప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్ర ధరను



రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 %ఎస్త్ర% ం క్లోపీడొగ్రెల్ 75 %ఎస్త్ర% మాత్రల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. చిన్నపిల్లలకు ఉపయోగించే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపం ఉన్న వారిలో వాడే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధర రూ.31.77కి తగ్గించింది. రిటైలర్లు, డీలర్లు అందరూ మెడికల్ షాపుల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించింది. ఎక్కువకు ధరకు ఆయా మందులను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్ 1955 ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపింది. ఆయా మెడిసిన్ల ధరలు మినహాయించామని.. అదనంగా జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేసి.. ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని ఆదేశించింది. తాజా ఆదేశాలతో ఆయా ఔషధాలపై ఇప్పటికే ఉన్న ధరల ఉత్తర్వులు రద్దయినట్లు స్పష్టం చేసింది.

# అసహజ మరణాల రికార్డులు డిలీట్
# ధర్మస్థలలో మరో షాకింగ్ విషయం

**ఇంటర్నెట్ డెస్క్:** ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటుచేసుకొన్న అసహజ మరణాల రికార్డులు మాయం అయ్యాయి. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కార్యకర్త ఒకరు వెలుగులోకి తీసుకొచ్చారు. తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను పూడ్చానని ఓ పారిశుద్ధ్య కార్మికుడి ప్రకటన సంచలనం సృష్టిస్తున్న వేళ ఈ విషయం బయటకు రావడం గమనార్హం. బెళ్తంగడి పోలీసులు 2000-2015 మధ్య అసహజ మరణాల రికార్డును ఓ పద్ధతి ప్రకారం తొలగించినట్లు ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తులో వెల్లడైంది. ఈ మేరకు అన్ నేచురల్ డెత్ రిజిస్టర్‌లో ఆ వివరాలు ఉన్నాయని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. ఇదే సమయంలో పెద్ద సంఖ్యలో అనుమానాస్పద, లెక్కలోకి రాని మరణాలు చోటు చేసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. తాజాగా ఆర్టీఐ కార్యకర్త జయంత్ సిట్ వద్ద ఫిర్యాదు చేశారు. ఓ యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతిపెట్టడం తాను చూశానని.. అధికారులు కూడా అక్కడే ఉన్నారని దానిలో



పేర్కొన్నారు. దీంతో సిట్ ఫిర్యాదు నమోదు చేసి.. ఆ మృతదేహాన్ని వెలికి తీయాల్సి ఉంది. పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి జయంత్ చాలా కాలం నుంచి ఆర్టీఐని వాడుకొంటున్నారు. ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు చెప్పారు. కానీ, తమ వద్ద ఉన్న పత్రాలు, పోస్టుమార్టం రిపోర్టులు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, ఫొటోగ్రాఫ్‌లు సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు నాశనం చేసినట్లు వారు చెప్పారన్నారు. దీంతో ఆగస్టు 2వ తేదీన సిట్ వద్ద ఫిర్యాదు నమోదు చేసినట్లు చెప్పారు. గతంలో ఓ యువతి మృతదేహం పోలీసులకు లభించగా.. దానిని నిబంధనలు ఉల్లంఘించి ఘోరంగా పాతిపెట్టారన్నారు. ఇప్పుడు మృతదేహ అవశేషాలు దొరికినా.. వాటిని ఎవరితో పోలుస్తారని ప్రశ్నించారు. ధర్మస్థలలో తాను వందకు పైగా యువతులు, మహిళల మృతదేహాలను ఖననం చేశానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన తొమ్మిది, పదో పాయింట్లలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తవ్వకాలు కొనసాగాయి. తొమ్మిదో ప్రాంతంలోనే తాను ఏడు మృతదేహాలను ఖననం చేశానని చెప్పడంతో కార్మికుల సాయంతో మధ్యాహ్నం వరకు మెల్లగా తవ్వకాలు చేయించారు. అక్కడ ఏమీ కనిపించకపోవడంతో మినీ బుల్డోజర్‌తో పనులు చేయించారు. అక్కడా ఏమీ లభించకపోవడంతో, పదో ప్రాంతానికి వెళ్లి తవ్వకాలు కొనసాగించారు.

# 'రెండు రూపాయల డాక్టర్' ఇకలేరు

**తిరువనంతపురం:** పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నిస్వార్థ సేవకుడు. డాక్టర్ ఏకే రైరూ గోపాల్ అలియాస్ 'రెండు రూపాయల డాక్టర్' ఆదివారం (ఆగస్టు 3న) కన్నుమూశారు. ఉత్తర కేరళలోని కన్నూర్‌లో వేలాది మంది జీవితాల్లో నిస్వార్థ సేవ చేసిన డాక్టర్ గోపాల్ పేదలు,అణగారిన ప్రజలకు దశాబ్దాలుగా(ఒక దశాబ్ధం అంటే 10ఏళ్లు) రెండు రూపాయిలకే వైద్యం అందించారు. డాక్టర్ ఏకే రైరూ గోపాల్ 50 ఏళ్ల పాటు అతి తక్కువకే రూ.2కే వైద్యం చేసేవారు. అందుకే ఆయనను అందరూ 'రెండు రూపాయల డాక్టర్..రెండు రూపాయల డాక్టర్' అని పిలుస్తుంటారు. ఇతర డాక్టర్లు ఒక్క ఓపీకి వందల్లో ఛార్జ్ చేస్తుంటే డాక్టర్ గోపాల్ మాత్రం పేషెంట్ స్థోమతను బట్టి రూ.40, రూ.50 మాత్రమే తీసుకునేవారు. అలా వైద్యం ఖరీదైన తరుణంలో డాక్టర్ గోపాల్ మాత్రం వైద్యంలో దాతృత్వం, నీతికి చిహ్నంగా నిలిచారు. వైద్యుడిగా సేవలందిస్తుండగా.. ఓ రోగి దారుణమైన పరిస్థితిని చూసి చలించిపోయారు. అలా ఆయన ప్రయాణం స్వచ్ఛంద సేవతో ప్రారంభమైంది. నాటి నుంచి ముఖ్యంగా రోజూవారి దినసరి కూలీలు, విద్యార్థులకు, పేదలకు అందుబాటులో సరసమైన వైద్యాన్ని అందించేందుకు తనని తాను అంకితం చేసుకున్నారు. విధులు నిర్వహించే సమయంలో తన మిత్రులు, కుటుంబ సభ్యులు,ఇంకెవరైనా తనని కలిసేందుకు వస్తే రోగులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు.. తన ఇంటి గేటుకు ఓ బోర్డు తగిలలించారు. ఆ బోర్డులో రోగులకు చికిత్స చేసే సమయంలో తనకోసం ఎవరూ రావొచ్చద్దు. ఒక వేళ రావాలని ప్రయత్నం చేస్తారేమో.. రావద్దు. చిరునవ్వుతో తిరిగి వెనక్కి వెళ్లిపోండి అని రాసి ఉంచారు. అంతలా తన వైద్య సేవల్ని అందించడంలో నిమగ్నమయ్యేవారు.

ఆయన ఎందుకంత ప్రత్యేకం

50 సంవత్సరాలకు పైగా వైద్య రంగంలో సేవ చేసిన ఆయన రూ.2 రూపాయలకే వైద్యం పొందేలా అవకాశం కల్పించారు. దినసరి కూలీలను దృష్టిలో ఉంచుకొని ప్రతి రోజూ అర్ధరాత్రి 2:15 నుండే రోగుల కోసం వైద్య సేవలు ప్రారంభించి.. ఇలా ప్రతి రోజు 300-400 మంది వరకు రోగులకు చికిత్స అందించేవారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే మందులే సూచించేవారు. గోపాల్‌కు తోడుగా ఆయన సతీమణి డాక్టర్ శకుంతల, సహాయకులు మందులు పంపిణీ చేయడంలో సహాయపడేవారు.


**డాక్టర్ గోపాల్ చేసిన సేవలకు గాను**

డాక్టర్ గోపాల్ చేసిన సేవలకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నుండి కేరళలో ఉత్తమ ఫ్యామిలీ డాక్టర్ అవార్డు పొందారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆయన



సేవలను ప్రశంసిస్తూ "ప్రజల డాక్టర్" అని అభివర్ణించారు. ఆయన దగ్గరకు వెళ్లడం అంటే మందు (మెడిసిన్) కోసం కాదు, ప్రేమ కోసం అని స్థానికులు చెబుతుండగా..'ఆయనను కలిస్తే ఎలాంటి అనారోగ్య సమస్య అయినా ఇట్టే తగ్గిపోతుందనేది రోగుల నమ్మకం. డాక్టర్ గోపాల్ తదనంతరంతో ఆయన సోదరులు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాజగోపాల్‌లు వైద్య సేవల్ని కొనసాగించనున్నారు.

## నితిన్ గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు..



**నాగపూర్:** ఇటీవలి కాలంలో బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం సంచలనంగా మారింది. దీంతో, రంగంలోకి దిగిన పోలీసులు.. గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్న నితిన్ గడ్కరీ నివాసంలో బాంబు పెట్టినట్లు ఓ వ్యక్తి.. పోలీసులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో, అప్రమత్తమైన పోలీసులు, బాంబ్‌స్క్వాడ్.. గడ్కరీ ఇంట్లో గాలింపు చర్యలు చేపట్టారు. సోదాల తర్వాత ఎటువంటి పేలుడు పదార్థాలు దొరకకపోవడంతో అది నకిలీ బెదిరింపు అని తేల్చారు. అనంతరం ఫోన్ నంబర్ ఆధారంగా గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నకిలీ బెదిరింపు కాల్ చేసిన వ్యక్తిని నాగ్‌పుర్ తులసి బాగ్ రోడ్‌లోని మద్యం దుకాణంలో పనిచేసే ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించామన్నారు. బెదిరింపు కాల్ చేయడానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## ఆయనకు ఏమైనా కారణాలుండొచ్చు



**ఢిల్లీ:** ఓ వైపు భారత్‌ను మిత్రదేశం అంటూనే మన ఆర్థిక వ్యవస్థను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. రష్యా, భారత్..వాటి డెడ్ ఎకానమీ (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థ)లను మరింత దిగజార్చుకోనీయండంటూ వ్యాఖ్యానించారు. వీటిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలను రాహుల్ సమర్థించడంపై ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ..కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలకు మద్దతివ్వడానికి రాహుల్‌కు మరేమైనా కారణాలు ఉండొచ్చన్నారు. అయితే, రాహుల్ అభిప్రాయంపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదన్నారు. భారత్- అమెరికా సంబంధాలపై థరూర్ మాట్లాడుతూ.. వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామిగా వాషింగ్టన్ న్యూఢిల్లీకి చాలా ముఖ్యమైందన్నారు. ఎందుకంటే భారత్ నుంచి అమెరికాకు దాదాపు 90 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఇరుదేశాల మధ్య సముచిత వాణిజ్య ఒప్పందం కుదిరేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఇటీవల థరూర్‌కు కాంగ్రెస్ పార్టీకి మధ్య అభిప్రాయభేదాలు తెరపైకి వస్తున్నాయి. ఆయన వ్యవహార శైలిపై సొంత పార్టీలో అసంతృప్తి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాహుల్‌పై థరూర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత నుంచి దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు పెనాల్టీలు విధించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్యం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. ఇరు దేశాలు ఆర్థికవ్యవస్థలను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఆయన వ్యాఖ్యలను సమర్థించారు. దీనిపై భారత ప్రధాని మోదీ ఘాటుగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందన్నారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు.

## మూడో రోజుకు చేరిన ఆపరేషన్ అఖల్

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదుల అంతుచూసేందుకునే భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ అఖల్ మూడో రోజుకు చేరింది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఆరుగురు ముష్కరులు హతమయ్యారు. ఓ జవాన్ గాయపడ్డారు. ఆపరేషన్ అఖల్ శుక్రవారం ప్రారంభమైన విషయం



తెలిసిందే. కుల్గాం జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు ఆగస్టు 1న గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య శనివారం రోజంతా కాల్పులు కొనసాగాయాయి. ఈ సందర్భంగా ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. మరోవైపు ముష్కరుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్ గాయపడ్డారు. మృతులు ఉగ్రవాదులు నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు చెందినవారని అధికారులు తెలిపారు. పహల్గామ్ ఉగ్రదాడికి టీఆర్ఎఫ్ బాధ్యత వహించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది పర్యాటకులు మరణించారు.

## మాలేగావ్ పేలుళ్లు కాంగ్రెస్ కుట్ర
## మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్

**ఇంటర్నెట్‌డెస్క్:** మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన భాజపా మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆదివారం భోపాల్ చేరుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 2008 మాలేగావ్ పేలుళ్లు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రగా అభివర్ణించారు. పార్టీ ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి, ఈ కేసులో భాజపాను ఇరికించడానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఈ కేసును దేశద్రోహం కింద విచారించాలని డిమాండ్ చేశారు. ఆనాటి పేలుళ్లకు భాజపాను కారణంగా చూపాలని ప్రయత్నాలు చేసిన వారికి కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు. కాంగ్రెస్‌వి మతతత్వ రాజకీయాలని.. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసుల్లో ఇరికించి.. జైళ్లలో హింసించేవారని ఆరోపించారు. మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన అనంతరం శనివారం ప్రజ్ఞా ఠాకూర్ మాట్లాడుతూ.. కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. అయితే అవన్నీ అబద్ధాలు కావడంతో తాను ఏమీ చెప్పలేదన్నారు.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# బాపట్ల జిల్లాలో ఘోరం

-మొదటిపేజీ తరువాయి

అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ క్వారీ ప్రమాదాలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ఈ ఘటనపై విచారణ జరపాలి: సీఎం చంద్రబాబు**

బల్లికురవ క్వారీ ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీలో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో పాటు మరి కొంత మంది కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్వారీలో పనులు చేస్తున్న కార్మికులపై రాళ్లు పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారని అన్నారు. ప్రమాదంలో ఇంతమంది ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో సీఎం మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఈ ఘటనపై విచారణ జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది: మంత్రి నారా లోకేష్**

బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలవడం తనను తీవ్రంగా కలచివేసిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రమాదంలో రోజువారీ కూలీలు మృతిచెందడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారికి అవసరమైన వైద్యసాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మంత్రి నారా లోకేష్ తెలియజేశారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి కొలుసు పార్థసారథి**

బల్లికురవ క్వారీ ప్రమాదంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. రెస్క్యూ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఏపీ ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని మంత్రి పార్థసారథి హామీ ఇచ్చారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ కలెక్టర్‌కు సూచించామని అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు.

**క్వారీ ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి**

బాపట్ల జిల్లాలో గ్రానైట్ క్వారీ ప్రమాదంపై మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బల్లికురవ సమీపంలోని ఓ గ్రానైట్ క్వారీలో రాయిపడి ఆరుగురు కార్మికులు మృతి చెందడంపై మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవి కుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మంత్రులు సానుభూతి తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని అధికారులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు.

**బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర..**

బల్లికురవ క్వారీ ప్రమాదంపై మంత్రి కొల్లు రవీంద్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనలో ఆరుగురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఆవేదన చెందారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రమాదంపై తక్షణమే విచారణ జరిపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

# ఉత్తరప్రదేశ్‌లో వరదలు

-మొదటిపేజీ తరువాయి

లఖ్‌నవూ,

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. వందలాది గ్రామాలు, కొన్ని నగరాలు పూర్తిగా నీట మునిగాయి. జన జీవనం స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాన్పూర్‌నగర్, లఖింపూర్ ఖేరీ, ఆగ్రా, ఔరారియా, చిత్రకూట్, బల్లియా, బండా, ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారాణసీ, చందౌలీ సహా 17 జిల్లాలను వరదలు ప్రభావితం చేశాయి. గంగా, యమునా, రామ గంగా, గోమతి సహాపలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్, వారాణసీ నగరాలు పూర్తిగా నీట మునిగాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 15 వేల ఇళ్లలోకి వరద నీరు చేరింది. పలు ప్రాంతాల్లో పీకల్లోతు వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు అక్కడి జనం పడుతున్న ఇబ్బందుల తాలుకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'వరదలతో 37 తహసీళ్లలోని 402 గ్రామాలకు చెందిన 84,392 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 47 వేలకు పైగా మందికి తక్షణ సాయం అందించాం. క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. 493 పడవలు, బోట్ల ద్వారా ఆహారం ప్యాకెట్లు, అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం' అని విపత్తు నిర్వహణ కమిషనర్ భానుచంద్ర గోస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి స్వతంత్రదేవ్ సింగ్ హమీర్‌పూర్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక రాబోయే 24 గంటల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో సర్కారుపై ప్రతిపక్ష నేత, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. 'ప్రయాగ్‌రాజ్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా అక్కడి ప్రజలకు వరద ముంపు కష్టాలు తప్పలేదు. బీజేపీ నేతల అవినీతిని అక్కడి నీటి గుంతలే స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ భావనపై నీళ్లు చల్లిన కాషాయ పార్టీ నేతలు తమ పడవల్లో ఎక్కడికో అదృశ్యమయ్యారు?' అంటూ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. 17 జిల్లాలు జలమయం

# విష్ణుకుమార్ రాజు వ్యూహాత్మక మౌనం

**విశాఖపట్టణం :** ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు.. విశాఖ నార్త్ ఎమ్మెల్యేగా పొత్తుల్లో భాగంగా రెండో సారి గెలుపొందారు. మనిషి ఎప్పుడు నెమ్మదిగా సైలెంట్ గా ఉన్నట్లు కనిపిస్తారు.. నోరు తెరిస్తే చాలు తనలో ఉన్న ఫైర్ ఒక్కసారిగా బయటికి వచ్చి ఎదుటి వ్యక్తికి మాటలతోనే చమటలు పట్టిస్తారు.. అలాంటి ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యే ప్రస్తుతం సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. సీరియస్ గా మాట్లాడటం కంటే సన్యాసం బెటర్ అంటూ వైరాగ్యంగా మాట్లాడుతున్నారంట.. అధికారం చేతిలో ఉన్నా ఏమీ చేయలేకపోతున్నామని తెగ ఇదై పోతున్నారంట.. ఇంతకీ వెటకారానికి పరాకాష్ట అయిన ఆయన మనసులో ఏముంది? ఎందుకు అధికారం కంటే సన్యాసమే బెటర్ అనే నిర్ణయానికి వచ్చారు? రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న బీజేపీ ఎమ్మె?ల్యే విష్ణుకుమార్‌రాజు. విశాఖపట్నం రాజకీయం రూటే సపరేటు.. ఇక్కడ రాజకీయాలు ఎప్పుడూ విభిన్నంగానే ఉంటాయి.. అక్కడ రాజకీయాలు ఎలా ఉంటే నాయకులు ఇంకా ఎలా ఉంటారో అర్థం చేసుకోవచ్చు.. రాజకీయాలకే రాజకీయాన్ని నేర్పే విశాఖ నార్త్ ఎమ్మెల్యే బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఒంటరి అయిపోయినట్లు ఫీల్ అవుతున్నారంట ఇప్పుడు.. విశాఖ నార్త్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన గత కొంతకాలంగా సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. వేదిక ఏదైనా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడే ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తనలో ఉన్న ఫైర్ ని పక్కన పెట్టేసి సైలెంట్‌గా గడిపేస్తున్నారు. రాజకీయ నాయకుడిగా బ్రహ్మాండమైన ఎమ్మెల్యే పదవి చేతిలో ఉంది.. అధికారం ఉంది కాబట్టి నియోజకవర్గంతో పాటు ప్రభుత్వంలోనూ చక్రం తిప్పొచ్చు.. కానీ విష్ణుకుమార్ రాజు అసలు అధికారమే లేదు అన్నట్లు వైరాగ్యంతో మాట్లాడుతూ కాషాయ పార్టీలోనూ, కూటమి ప్రభుత్వంలో ఉండడం కంటే కాషాయం కట్టేసి సన్యాసిగా మారిపోవడం బెటర్ అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారంట. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు. ప్రస్తుత ఏపీ కూటమి ప్రభుత్వంలో బిజెపి కూడా భాగస్వామి.. 2014 ఎన్నికల్లో టిడిపి, బిజెపి కలిసి పోటీ చేసినట్లే 2024 ఎన్నికల్లో కూడా జనసేనతో కలిసి పోటీ చేయడంతో ప్రభుత్వంలో భాగస్వాములు అయ్యారు బిజెపి ఎమ్మెల్యేలు.. 2014 ఎన్నికల్లో కూటమితో జట్టు కట్టిన సమయంలో విశాఖ నార్త్ నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యేగా గెలిచారు.. తర్వాత కూటమి నుండి చంద్రబాబు బయటికి వచ్చేయడంతో పదవి ఉన్న ప్రయోజనం లేకుండా పోయింది విశాఖ నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకి .. 2019 ఎన్నికల్లో విష్ణుకుమార్ పొత్తులు లేకుండా బీజేపీ నుంచి పోటీ చేసినా విశాఖ నార్త్ నుంచి టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చేతిలో పరాజయం పాలయ్యారు.. అధికారం ఉంటే ఏంటి? లేకపోతే ఏంటి అనే ధోరణి. 2024 ఎన్నికల్లో మళ్లీ కూటమితో జతకట్టడంతో అధికార పార్టీ ఎమ్మెల్యేగా విష్ణుకుమార్ రాజు అధికారాన్ని నిలబెట్టుకున్నారు.. అయితే ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుండి అధికారం ఉండి ఏమి లాభం పవర్ చూపించలేనప్పుడు.. అధికారం ఉంటే ఏంటి లేకపోతే ఏంటి అనే ధోరణి విష్ణు కుమార్ రాజులో స్పష్టంగా కనిపిస్తుందంట.. 2019 ఎన్నికల నాటి నుండి ఇప్పటి వరకు విశాఖ నార్త్ నియోజకవర్గం వైసీపీ నాయకుడిగా కొనసాగుతున్న కేకే రాజు మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు ప్రస్తుత ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు.. నిన్న మొన్నటి వరకు కేకే రాజు విశాఖ నార్త్ నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా మాత్రమే కొనసాగారు.. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఆ పార్టీలో ప్రమోషన్ పొంది ఇంకో మెట్టు ఎక్కారు.. 2019 ఎన్నికల తర్వాత దూకుడు పెంచిన కేకే రాజుని మళ్లీ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా చేయడంతో కట్టడి చేయాల్సింది పోయి, అధికార కూటమిలోని ఇతర నాయకులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మండిపోతున్నట్లు కనిపిస్తుంది.. కేకే రాజును కట్టడి చేయలేని ఈ పదవి అధికారం ఎందుకు? దీనికంటే కాషాయం తీసుకుని రాజకీయ సన్యాసం తీసుకోవడమే బెటర్ అనే ధోరణిలో బహిరంగ వేదికలపైనే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు విశాఖ నార్త్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు తర్వాత భీమిలికి షిఫ్ట్ అయి విశాఖ నార్త్‌ను గాలికొదిలేశారు.. ఎమ్మెల్యేగా గెలవకపోలేయినా విశాఖ నార్త్ నియోజకవర్గం అనధికార ఎమ్మెల్యేగా కేకే రాజు నియోజకవర్గంలో తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజా సమస్యలను చూస్తూ నియోజకవర్గంలో తన బలమైన ముద్ర వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.. అప్పట్లో విశాఖ ఎయిర్‌పోర్టులో చంద్రబాబుని అడ్డుకున్న రాజు. కేకే రాజు ప్రస్తుతం అనధికారిక ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాజు వైసిపి అధికారంలో ఉన్న సమయంలోనే విశాఖ పర్యటనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబును విశాఖ ఎయిర్పోర్టులో అడ్డుకున్నారు? ఆ ఆందోళనకు నాయకత్వం వహించింది విశాఖ నార్త్ వైసీపీ నాయకుడు కేకే రాజు.. అంతేకాదు 2022లో విశాఖ వచ్చిన పవన్ కళ్యాణ్ ని సైతం వైసీపీ నాయకులు అడ్డుకున్నారు.. ఆ ఆందోళనకు ముందుండి నాయకత్వం వహించింది మళ్లీ కేకే రాజునే.. ఒక మాజీ ముఖ్యమంత్రిని మరో పార్టీ అధ్యక్షుడిని రెండుసార్లు విశాఖలో అడ్డుకుని అధికారాన్ని కోల్పోయిన తర్వాత ఒక పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా ప్రమోషన్ తో దూసుకుపోతూ ముందుకు వెళ్తున్న కేకే రాజు మీద ఎందుకు కేసులు పెట్టి అరెస్టు చేయడం లేదని బహిరంగంగానే ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు.. రెండు పార్టీల అధినేతలను అడ్డుకున్న కేసులు ఉన్నా కూడా ఎందుకు ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెగ ఫీల్ అయిపోతున్నట్లు తెలుస్తుంది. కేకే రాజుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న విష్ణుకుమార్. ఈ మధ్యకాలంలో ప్రభుత్వ వేదికలపైన, పార్టీ వేదికల పైన విష్ణుకుమార్ రాజు ఓపెన్ అయిపోతూ కేకే రాజు మీద తీవ్రమైన విమర్శలు గుప్పిస్తున్నారు.. ప్రస్తుతం కూటమికి చెందిన ఇద్దరు అతిరథులకు గతంలో విశాఖ వచ్చినప్పుడు ఇబ్బంది పెట్టడానికి నాయకత్వం వహించిన కేకే రాజును అలా ఎందుకు వదిలేసారంటూ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తెగ మధన పడిపోతున్నట్లు తెలుస్తుంది.. ముఖ్యంగా వైసిపి అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌తో పాటు ఇబ్బంది పడిన వారిలో ప్రస్తుత హోంమంత్రి అనిత కూడా ఉన్నారు? ప్రస్తుతం అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర హోం మంత్రి ముగ్గురు కూడా అంతా ఆ దేవుడే చూసుకుంటాడు అనుకుంటూ ఉంటే.. ఇంకా రాజకీయాల్లో అధికారం ఎందుకు అంటూ సన్నిహితులు దగ్గర విష్ణుకుమార్ రాజు వాపోతున్నారంట. విశాఖ నార్త్‌లో తనకు ఇబ్బందులు తప్పవని రాజు ఆందోళన. విశాఖ నార్త్ నియోజకవర్గం ఇన్చార్జిగా ఉన్నప్పుడే అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుని, ఇప్పటి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను అడ్డుకున్న కేకే రాజు 2024 ఎన్నికల తర్వాత విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా నియమించడంతో కేకే రాజు పరపతి, దూకుడు పెరిగితే భవిష్యత్తులో విశాఖ నార్త్ నియోజకవర్గ నుండి ఆయనకు ఎదురు లేకుండా పోతుందని, అప్పుడు తనకు ఇబ్బందులు తప్పవని విష్ణుకుమార్ భావిస్తున్నారంట.. అంతుకే కూటమి భాగస్వామ్యపార్టీలు కేకే రాజును టార్గెట్ చేసి ఇబ్బంది పెట్టాలని డిమాండ్ చేస్తున్నారంట.. ముఖ్యంగా విశాఖ నార్త్ నియోజకవర్గం నుండి తనకు ఎదురు లేకుండా చూసుకోవాలంటే రాజకీయంగా బలంగా ఉన్న వైసిపి నాయకుడు కేకే రాజుని కట్టడి చేస్తే తప్ప భవిష్యత్తు ఉండదని ఆయన భావిస్తున్నారంట.. కేకే రాజు అరెస్ట్‌ని టార్గెట్‌గా పెట్టుకున్న విష్ణుకుమార్ రాజు. ఇప్పటికే లిక్కర్ కేసు తో పాటు ఇతర కేసుల్లో వైసిపి నాయకులను అరెస్టులు చేసి జైలుకు పంపిస్తున్న కూటమి ప్రభుత్వం ఎందుకు కేకే రాజు విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుంది అని సన్నిహితుల దగ్గర విష్ణుకుమార్ రాజు అంటున్నట్లు సమాచారం.. కేకే రాజు మీద ఉన్న అసంతృప్తిని బాహాటంగానే బయటపెడుతున్న విష్ణుకుమార్ రాజు ఆయన్ని అరెస్టు చేసేంతవరకు ఊరుకునేలాగా లేరు అని లోకల్ నాయకులు మాట్లాడుకుంటున్నారు.. కేకే రాజు విషయంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కాని.. అధికారం ఉండి ఏం ప్రయోజనం అధికారం కంటే కాషాయం కట్టి సన్యాసుల్లో కలిసిపోవడం బెటర్ అన్నట్లు విశాఖ నార్త్ బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు భావిస్తున్నారంట..



## స్మార్ట్ ఫోన్ ఎగుమతుల్లో భారత్ ప్రభంజనం

భారతదేశం నుంచి స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు సరికొత్త శిఖరాలకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) దేశం నుంచి రికార్డు స్థాయిలో ఎగుమతులు నమోదైనట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మూడు నెలల కాలంలోనే ఏకంగా 7.72 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 64,500 కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు విదేశాలకు ఎగుమతి అయ్యాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 58 శాతం అధికం కావడం విశేషం. ఈ భారీ వృద్ధిలో టెక్ దిగ్గజం యాపిల్ కీలక పాత్ర పోషించింది. మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో దాదాపు 78 శాతం వాటా ఒక్క యాపిల్ సంస్థదే కావడం గమనార్హం. తన కాంట్రాక్ట్ తయారీదారుల ద్వారా యాపిల్ ఏకంగా 6 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను భారత్ నుంచి ఎగుమతి చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే యాపిల్ ఎగుమతులు 82 శాతం పెరిగాయి. భారతదేశ స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల చరిత్రలో ఒక త్రైమాసికంలో ఇంతటి వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం ఈ అద్భుతమైన ప్రగతికి ప్రధాన కారణంగా నిలుస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ పథకం ద్వారా దేశంలో స్థానిక తయారీ గణనీయంగా పెరిగింది. 2021 ఆర్థిక సంవత్సరంలో కేవలం 3.1 బిలియన్ డాలర్లుగా ఉన్న స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు, 2025 నాటికి 24.1 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో 17.5 బిలియన్ డాలర్లు ఒక్క యాపిల్ వాటానే ఉంది. మొత్తంగా ఎలక్ట్రానిక్స్ రంగం కూడా పరుగులు పెడుతోంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశం నుంచి 12.4 బిలియన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఎగుమతి కాగా, ఇందులో స్మార్ట్‌ఫోన్ల వాటా 62 శాతానికి పెరిగింది. ఇది కేవలం అసెంబ్లింగ్ నుంచి విలువ ఆధారిత తయారీ వైపు భారత్ పయనిస్తోందనడానికి నిదర్శనమని నివేదికలు చెబుతున్నాయి. యాపిల్ తర్వాత శాంసంగ్ 12 శాతం వాటాతో రెండో స్థానంలో ఉండగా, డిక్సన్ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ ప్యాడ్జెట్ ఎలక్ట్రానిక్స్ 175 మిలియన్ డాలర్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది. ఒకప్పుడు ఎగుమతుల జాబితాలో 167వ స్థానంలో ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ఇప్పుడు దేశం నుంచి ఎగుమతి అయ్యే వస్తువుల్లో అగ్రస్థానానికి చేరి ప్రపంచ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రంగా భారత్ స్థానాన్ని సుస్థిరం చేశాయి.

## ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు తప్పదు

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, దాని ప్రభావంపై మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. ఏఐ రాకతో పారాలీగల్స్, ఎంట్రీ-లెవల్ అకౌంటెంట్ల వంటి కొన్ని ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయన అంగీకరించారు. అయితే, ఇదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఏఐ ఒక గొప్ప వరంగా మారుతుందని, అనేక రంగాల్లో ఉత్పాదకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏఐ సామర్థ్యాలపై మాట్లాడుతూ, టెలిసేల్స్, టెలి సపోర్ట్ వంటి పనులతో పాటు సాధారణ కోడింగ్ టాస్క్‌లను కూడా ఏఐ సమర్థవంతంగా నిర్వహించగలదని బిల్ గేట్స్ పేర్కొన్నారు. అయితే, అత్యంత సంక్లిష్టమైన కోడింగ్ సవాళ్లను ఎదుర్కొనే స్థాయికి ఏఐ ఇంకా చేరుకోలేదని స్పష్టం చేశారు. ఈ స్థాయికి చేరడానికి ఒకట్రెండు సంవత్సరాలు పడుతుందా లేక దశాబ్ద కాలం పడుతుందా అనే దానిపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని ఆయన వివరించారు. ఏఐ పరిశోధనలో కనిపిస్తున్న వేగవంతమైన పురోగతి తనను ఆశ్చర్యపరిచిందని గేట్స్ తెలిపారు. ముఖ్యంగా అల్ప ఆదాయ దేశాలలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో ఉత్పాదకతను పెంచడానికి ఏఐకి అపారమైన అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సరైన పద్ధతిలో వినియోగిస్తే, ఏఐ మానవాళి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గతంలో పరిశ్రమల్లోకి రొబోటిక్ ఆర్మ్స్ వచ్చినప్పుడు బ్లూ-కాలర్ ఉద్యోగాలపై ఎలా ప్రభావం పడిందో, ఇప్పుడు ఏఐ రాకతో వైట్-కాలర్ ఉద్యోగాలపై అలాంటి ప్రభావమే ఉంటుందని ఆయన పోల్చారు. ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచం సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

## ఏటీఎంలలో రూ. 500 నోట్లు బంద్?

ఏటీఎంల ద్వారా 500 రూపాయల నోట్ల జారీని నిలిపివేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశాలు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్‌బీఐ అలాంటి ఆదేశాలేవీ ఇవ్వలేదని, ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని హెచ్చరించింది.

**వైరల్ మెసేజ్‌లో ఏముంది?**

2025 సెప్టెంబర్ 30 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల జారీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను ఆదేశించిందని ఓ సందేశం వాట్సాప్‌లో చక్కర్లు కొడుతోంది. 2026 మార్చి 31 నాటికి 90 శాతం, సెప్టెంబర్ 30 నాటికి 75 శాతం ఏటీఎంలలో ఈ నోట్ల పంపిణీ ఆగిపోతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 500 నోట్లను మార్చుకోవాలని, భవిష్యత్తులో ఏటీఎంలలో కేవలం రూ. 100, రూ. 200 నోట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని కూడా అందులో ఉంది.

**ప్రభుత్వం ఏం చెప్పింది?**

ఈ వైరల్ సందేశంపై ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ అయిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఆర్‌బీఐ అలాంటి సూచనలేవీ చేయలేదని, రూ. 500 నోట్లు చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "సెప్టెంబర్ 2025 నాటికి ఏటీఎంల నుంచి రూ. 500 నోట్ల పంపిణీని నిలిపివేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను కోరిందా? ఈ మేరకు వాట్సాప్‌లో వ్యాపిస్తున్న సందేశం పూర్తిగా అవాస్తవం. ఆర్‌బీఐ నుంచి అలాంటి ఆదేశాలు జారీ కాలేదు. రూ. 500 నోట్లు చెల్లుబాటులోనే కొనసాగుతాయి" అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తన పోస్టులో పేర్కొంది. గత నెలలో కూడా ఇలాంటి వదంతే సోషల్ మీడియాలో వైరల్ అయిందని, అప్పుడు కూడా దానిని ఖండించామని అధికారులు గుర్తుచేశారు. కరెన్సీకి సంబంధించిన ఏ సమాచారాన్నైనా నమ్మే ముందు ఆర్‌బీఐ లేదా పీఐబీ వంటి అధికారిక వర్గాల ద్వారా నిర్ధారించుకోవాలని, ఇలాంటి మోసపూరిత సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## ఎల్వీ సుబ్రహ్మణ్యం ఏఐపై అవగాహన లేకుండా వ్యాఖలు చేయడం బాధాకరం

-మొదటిపేజీ తరువాయి

విమర్శించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. ప్రస్తుతం భక్తులను గంటలు, ఒక్కోసారి రోజుల తరబడి కంపార్ట్‌మెంట్లలో, షెడ్లలో ఉంచి ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతేనా అని బీఆర్ నాయుడు ప్రశ్నించారు. భక్తుల కష్టాలను దూరం చేయాలన్న సదుద్దేశంతోనే ఏఐ టెక్నాలజీని తీసుకురావాలని నిర్ణయించామన్నారు. ప్రపంచమంతా టెక్నాలజీ వైపు పరుగులు పెడుతున్నప్పుడు, టీటీడీ కూడా దానిని అందిపుచ్చుకోవడంలో ఎలాంటి తప్పులేదని ఆయన అభిప్రాయపడ్డారు. భక్తులలో అనవసర గందరగోళం సృష్టించేలా ఏఐ టెక్నాలజీకి స్వస్తి పలకాలని సుబ్రహ్మణ్యం చేసిన సూచన ఎంతమాత్రం సరికాదని నాయుడు అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను పూర్తిగా ఖండిస్తున్నట్లు బీఆర్ నాయుడు స్పష్టం చేశారు.

## యూపీలో ఘోర ప్రమాదం... కాలువలోకి దూసుకెళ్లిన కారు...

ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం నాడు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భక్తులతో వెళుతున్న ఒక వాహనం అదుపుతప్పి కాలువలో పడటంతో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన గోండా జిల్లాలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. మోతిగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహగావ్ గ్రామానికి చెందిన 14 మంది ఒక బొలెరో వాహనంలో ఖర్గుపూర్‌లోని పృథ్వీనాథ్ ఆలయానికి పూజల కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో వీరి వాహనం సరయూ కాలువలోకి దూసుకెళ్లింది. వాహనం నీటిలో మునిగిపోవడాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొందరు గ్రామ పెద్దకు విషయం చేరవేశారు. సమాచారం అందుకున్న ఇటియాథోక్ పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నీటిలో మునిగిపోయిన వాహనం నుంచి మృతదేహాలను వెలికితీశారు. మృతులలో పురుషులు, మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు.

# అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)

# నెల్లూరు జిల్లా 16వ మహాసభలు జయప్రదం చేయండి

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 3**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహాసభలు ఇందుకూరుపేట మండలం ఇందుకూరుపేట షాదీ మంజిల్ లో మంగళవారం అనగా 5/8/2025న జరగ నున్నాయి ఈ మహాసభలకు తోటపల్లి గూడూరు మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహిళ సాధికారత హక్కుల సాధన కొరకు అక్కడ జరిగే మహాసభలు జయప్రదం చేయాలని మహిళా సంఘం టి పి గూడూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు కందిపాటి రమణమ్మ దామవరపు ఉష పిలుపునిచ్చారు . అనంతరం మండలంలో మహిళా సంఘం మహాసభల కరపత్రాలు పంపిణీ చేసి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య సిఐటియు మండల కార్యదర్శి మారు బోయిన రాజా మాట్లాడుతూ... అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహిళల అభివృద్ధి కొరకు హక్కుల సాధనకై జిల్లా వ్యాప్తంగా కృషి చేస్తుందని రాష్ట్రంలో 3 లక్షల మంది జిల్లాలో 25,000 మంది మహిళలు సభ్యత్వం కలిగి ఉన్నారని, దేశంలోనూ రాష్ట్రంలోనూ జిల్లాలలోనూ పసిబిడ్డలపై మహిళలపై లైంగిక వేధింపులు అత్యాచారాలు హత్యలు, మితిమీరిపోతున్నాయని ఇవి మరింత పెరగడానికి మద్యం మత్తు పదార్థాలు అశ్లీల చిత్రాలు కారణమవుతున్నాయని నెల్లూరు జిల్లాలో మహిళా సంఘం



ఏర్పడినప్పటి నుండి విద్య వైద్యం స్థానిక సమస్యలపై సమానతల కోసం నిరంతరం వివిధ కార్యక్రమాల రూపంలో మహిళలకు తెలియచెప్పేలా నిర్వహిస్తున్నదని. నెల్లూరు జిల్లాలో 1990లో ఏర్పడినటువంటి పొదుపు గ్రూపుల నిర్వహణలో అంటే పొదుపు గ్రూపులో ఏర్పాటు చేయడంలో పొదుపు మహిళలకు బ్యాంకు నుండి రుణాలు ఇప్పించడంలో వారి సమస్యలు పరిష్కరించడంలో మహిళా సంఘం ముందుండి పని చేసిందని మద్యం మత్తు పదార్థాలను అశ్లీల చిత్రాలను అరికట్టాలని, మహిళలకు ఉపాధి కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలని, మహిళా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోరుయాత్ర పేరుతో నెల్లూరు జిల్లాలోని 15 మండలాల్లో 40 గ్రామాల్లో పర్యటించి మహిళలు సమస్యలపై ఉద్యమించడం జరిగిందని. ఈ మండలంలో కూడా నరుకూరు సెంటర్లో బ్రాందీ షాప్ కు వ్యతిరేకంగా మహిళా సంఘం పోరాటం చేసిందని అధికార పార్టీ నేతలు ప్రజలు ఇబ్బంది పడుతున్న సరే నడిరోడ్డుపై బ్రాందీ షాప్ ఏర్పాటు చేసి మహిళలు ఇబ్బందే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో మహిళా సమస్యల పరిష్కారానికై పోరాటాలు ఉద్యమాలు, కార్యక్రమాలు రూపొందించుకునేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా మహాసభలు జరగనున్నాయని మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా డి రమాదేవి రాష్ట్ర కార్యదర్శి, షేక్ మస్తాన్ బి జిల్లా కార్యదర్శి, టి శివ కుమారి జిల్లా అధ్యక్షురాలు, ఎస్కె సల్మా ఇందుకూరుపేట మండల అధ్యక్షురాలు పాల్గొంటారని తెలియజేశారు

## ఉచిత వైద్య శిబిరం - పేద ప్రజలకు వరం



**పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 3.**

చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెలా మొదటి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రలయం సహకారంతో మండలంలోని ట్రస్ట్ ఆవరణలో ఏర్పాటు చేశామని మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరిశంకర్, సీఈవో సీతారాం నాయుడు విలేకరుల సమావేశంలో తెలిపారు. మండలంలోని సాయిబాబా మందిరంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు సీనియర్ వైద్య నిపుణులైన అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్ రవి తేజ, డాక్టర్ ఆకాంక్ష ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 250మందికి పరీక్షలను ఉచితముగా నిర్వహించి 85మందికి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. 56 మంది రోగులకు ఉచిత కంటి అద్దాలు, 80 మందికి ఉచితంగా ఆపరేషన్ లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కండలేరు ఎడమ కాలువకు జలకళ

## ఎమ్మెల్యే కృషిని ప్రశంసించిన పొదలకూరు రైతులు

**పొదలకూరు స్వర్ణ సాగరం ఆగస్టు 3**





కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గిపోవడంతో సాగు చేస్తున్న వరి పంటలు నిమ్మ తోటలు పశువుల అవసరాలకు త్రాగునీటి వసతి కారణంగా రైతులు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి దృష్టికి చేరడం జరిగింది. ఎడమ కాలువ లిఫ్ట్ కు విద్యుత్ సరఫరా అందించే ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడం జరిగింది ఈ విషయాన్ని శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో ప్రస్తావించడం జరిగింది. దీంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఆనంద్ నిధులు మంజూరు చేయడంతో యుద్ధప్రాతి పదికన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. సోమిరెడ్డి సమస్యను వెంటనే పరిష్కరించడం పట్ల రైతులు ధన్యవాదాలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో పొదలకూరు మండల అధ్యక్షులు తలనీరు మస్తాన్ బాబు పట్టణ అధ్యక్షులు బి మల్లికార్జున్ నాయుడు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి దేవినేని పులిపాటి వెంకటేశ్వర్లు ఎత్తపు వెంకటరెడ్డి వెన్నపూస శ్రీనివాసరెడ్డి మలిరెడ్డి ఓబుల్ రెడ్డి రమణారెడ్డి తదితరులు న్నారు

# ప్లాస్టిక్ కవర్లు వినియోగం నివారించాలి





## కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి

**కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 03**

కనిగిరి పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని అరికట్టే ఉద్దేశంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక రైడ్లు చేపట్టారు. ఆదివారం పట్టణంలోని కొట్లబజారు, ఎంఎస్ఆర్ రోడ్డు, తీగలగొంది తదితరు ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్ల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కమీషనర్ పి. కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి పెను నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. మాంసం, కిరాణా మరియు కూరగాయల షాపు ల వద్ద తనిఖీ లు చేసి ఫైన్స్ వసూలు చేశామన్నారు. ఇంకో సారి చూస్తే లైసెన్స్ రద్దు చేసి షాపు మూయిస్తాము అని హెచ్చరిక జారీ చేశారు. పట్టణంలోని హెూల్సేల్ మరియు రిటైల్ షాపులపై ఆకస్మిక తనిఖీ నిర్వహించి, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న యజమానులకు రూ.10,000/- జరిమానా విధించారు. భవిష్యత్తులో మళ్ళీ ఇవి పునవృతమైతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కమీషనర్ వెంట మునిసిపల్ సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు రమణారెడ్డి, నాగలక్ష్మి, నాగజ్యోతి, బాషా తదితరులున్నారు.



తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

## వైభవంగా భరతనాట్యం కూచిపూడి ప్రదర్శన



**కాణిపాకం , ఆగస్టు 3 స్వర్ణ సాగరం**

వైభవంగా భరతనాట్యం, కూచిపూడి నాట్య ప్రదర్శన. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దేవస్థానం నందు సాయంత్రం కళానివేదన లో భాగంగా ఆలయ పుష్కరి నందు శ్రీనృత్య నాట్యాలయ బెంగళూరు వారు అత్యంత వైభవంగా భరతనాట్యం మరియు కూచిపూడి, నాట్య ప్రదర్శన ప్రదర్శించడం జరిగింది, ఈ కార్యక్రమమునకు దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, విచ్చేసి కళాకారులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం తో అభినందించారు.

## కాణిపాక స్వామివారిని దర్శించుకున్న ఐ వి ఆర్ కృష్ణారావు





**కాణిపాకం, ఆగస్టు 3 స్వర్ణ సాగరం**

కాణిపాక స్వామివారిని దర్శించుకున్న మాజీ ఐఏఎస్ ఐ.వి.ఆర్. కృష్ణారావు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న మాజీ ఐఏఎస్ అధికారి ఐ.వి.ఆర్ కృష్ణారావు , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా పోట్లపూడి రాజేష్ జన్మదిన వేడుకలు



**స్వర్ణసాగరం (నాయుడుపేట) ఆగస్టు03.**

నాయుడుపేట పట్టణంలోని ఎస్ జె జువెలరీస్ అధినేత,తెలుగుదేశం పార్టీ నేత పోట్లపూడి రాజేష్ జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోట్లపూడి రాజేష్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు.అనంతరం పలువురు వ్యాపారులు,మిత్రులు, శ్రేయోభిలాషులు,కుటుంబ సభ్యులు రాజేష్ కు శాలవాలు కప్పి,పూలమాలలు వేసి,జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో,ఆనందంగా జీవించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భారతాల సాయిరామ్ కిషోర్, గోనుపల్లి గురుమూర్తి,బల్లి కుమార్,సతీష్,ప్రభాకర్,రామ్ దేవ్,ధరణి,యాసిన్,మణి రాఘువ, ప్రసాద్,కేవల్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ అమల్లోనూ చంద్రబాబుది మోసమే- వైసీపీ ఇంచార్జి దద్దాల



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 03

"సుఖీభవకు కోత.. అన్నదాతకు వాత" అనే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు అన్నదాతలను మోసం చేసారని కనిగిరి వైయస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైయస్సార్‌సీపీ హయాంలో 53.58 లక్షల మందికి లబ్ది చేకూర్చాగా, ఇప్పుడూ చంద్రబాబు ప్రభుత్వం 46.86 లక్షల మందికే వర్తింపజేసి సుమారు రాష్ట్రంలో 7 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయాన్ని కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాదిపాటు అన్నదాత సుఖీభవ ఇవ్వకుండా రూ.10,716 కోట్లు పూర్తిగా ఎగనామం పెట్టిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రతి రైతుకూ వ్యవసాయ పెట్టుబడి సాయంగా కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా రాష్ట్ర ఖజానా నుంచి రూ. 20 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చారని చెప్పారు.నేడు దానిని ఎందుకు రూ. 14 వేలకు తగ్గించారో, మిగిలిన రూ. 6 వేలు ఎందుకు ఎగ్గొడుతున్నారో సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగిన ప్రతి సందర్భం లోను కేవలం 30 రోజుల్లోనే పరిహారం చెల్లించామని గుర్తు చేశారు.రైతుల పక్షాన ఉచిత పంటల భీమా ప్రీమియాన్ని భరించమన్నారు.కానీ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ పండించిన ఏ పంటకు కూడ సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు.రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఈ సందర్భంగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.

# "మార్నింగ్ స్టార్స్ క్రికెట్ క్రీడాకారులకు బహుమతి" ప్రధానం



ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 3

మండలంలోని నరసాపురం ఎం.వి.ఆర్.ఆర్ పాఠశాల ప్రాంగణంలో మార్నింగ్ స్టార్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏడవ క్రికెట్ టీం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కాన్ ఫోటోగ్రఫీ నిర్వాహకులు అంగీర్ శ్యాం విచ్చేసి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని యువత మార్నింగ్ స్టార్స్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు యువతను క్రీడలపై దృష్టి పెట్టే విధంగా ప్రోత్సహించాలన్నారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురేష్ నరేష్ క్రీడాకారులు పాల్గొన్నారు

# శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి





రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 03

శ్రీశ్రీశ్రీ కట్ట పుట్టాలమ్మ ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం నాడు అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ని వైఎస్సార్ సిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను పలువురు కార్యకర్తలు సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేష్, వార్డ్ మెంబర్లు వెంకటరమణ, ఇన్బనాథన్, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# 2025 లో సిరివెన్నెల జాతీయ పురస్కారం అందుకున్న వీకోట రచయితలు




వి.కోట స్వర్ణ సాగరం ఆగస్టు 3:

చిత్తూరు జిల్లా వి.కోట మండలం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య,దక్షిణ భారత దేశం,మరియు ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో, పద్మశ్రీ డాక్టర్ సిరి వెన్నెల సీతారామ శాస్త్రి వారిసాహితీ వైభవం పై కవితా గానం జరిగింది. కొందరుప్రముఖులు మాట్లాడుతూ తెలుగు పాటల సాహిత్యం లో ఎన్నో మంచి సాహిత్యం, మనసునకు హత్తు కునే విధంగా వారి సాహితీ సంపద కలకాలం తెలుగువారి గుండెల్లో దాగి వుందని అన్నారు.చిత్తూరు స్థానిక రెడ్డిభవన్ లో జరిగిన ఈ కార్యక్రమం లోమన వి.కోటకవులకవయిత్రి డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం, డాక్టర్ జి. శాంతకుమారి, డాక్టర్ రఘు పతి, వారికి నిర్వాహకులు ఘనంగా సన్మానం మరియు సిరివెన్నెల జాతీయ పురస్కారం -2025 షీల్డ్ ప్రశంసా పత్రం ను అందజేశారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ మర్రిపూడి దేవేంద్ర రావు, డాక్టర్ సి. నారాయణ స్వామి, వికోట కు చెందిన ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ దామోదర్ రెడ్డి, మైసూరు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫసర్ డాక్టర్ చక్రపాణి, రాష్ట్ర నలుమూలల నుండి కవులు కవయిత్రులు పాల్గొన్నారు.

# 200 నోటులో సాంచి స్థూపం ఒక అద్భుతం..

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 03

కనిగిరి కాకి పిచ్చుక స్కూల్లో ఆదివారం చిన్నారులు 200 రూపాయల నోటులోని సాంచి స్తూపం యొక్క ఘనతను డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ చిన్నారులకు వివరించినారు. సాంచి స్తూపంను మధ్యప్రదేశ్ లోని సాంచి గ్రామం నందు మౌర్య చక్రవర్తి అశోకుడు నిర్మించారని తెలియజేశారు. ఇది గౌతమ్ బుద్ధుని ధర్మాన్ని మరియు బౌద్ధ మత ఆచారాలను ప్రతిబింబించే స్థలం అని అన్నారు. స్తూపం ఒక గుండ్రపు ఆకారంలో నిర్మించబడిందని దీని మధ్యలో బుద్ధుని అవశేషాలు ఉన్నాయని ప్రజలు విశ్వసిస్తారు. సాంచి స్థూపానికి నాలుగు వైపులా తోరణాలు అద్భుతమైన శిల్పకళలతో రూపొందిందని తెలియజేశారు. ఈ శిల్పాలు బుద్ధుని జీవితచరిత్రను, జాతక కథలను మరియు ధర్మ ప్రచారానికి సంబంధించిన దృశ్యాలను చూపిస్తాయని అన్నారు. ఇది భారతీయ శిల్పకళా నైపుణ్యానికి ఉదాహరణగా ఈ స్థూపాన్ని చూపిస్తారని మరియు ఈ ప్రాంతాన్ని బౌద్ధ విద్యాభ్యాస కేంద్రంగా ఉపయోగించారని ఆయన తెలియజేశారు. ప్రతి సంవత్సరం పర్యాటకులు,చరిత్ర అభిమానులు,ఆధ్యాత్మిక యాత్రికులు ఈ స్థూపాన్ని సందర్శిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులు వైకుంఠపాళీ, గోలీలాటలు, చదరంగం, రంగులను గుర్తు పట్టడం, ఏడు పెంకులాట ఆటలను ఆడినారు. శ్రీకృష్ణుడు కుచేలుడు స్నేహం కథను చిన్నారులకు వివరించినారు.



ప్రస్తుత సమాజంలో స్నేహం ముసుగులో మోసం చేసేవారు కూడా ఉంటారని అలాంటి వారికి దూరంగా ఉండాలని వారిని ముందే పసిగట్టాలని చిన్నారులకు హితబోధ చేశారు. తర్వాత






చిన్నారులు ఫ్రెండ్షిప్ డే సందర్భంగా ఒకరినొకరు షేకహాండ్స్ఇచ్చుకొని ఒకరినొకరు అభినందించుకున్నారు.

# చంద్రన్నకు పాలాభిషేకం రైతులకు పట్టాభిషేకం రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్





స్వర్ణసాగరం తవణంపల్లి ఆగస్టు-3

తవణంపల్లి మండల పరిధిలోని జొన్న కురుకుల గ్రామంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ రైతులతో చంద్రన్నకు పాలాభిషేకం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం పట్టాభిషేకం రైతులకు

చెప్పిన మాట చెప్పినట్లుగా సూపర్ సిక్స్ పథకంలో భాగంగా రైతులకు, రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా తొలి విడత 7000/- రూపాయలు రైతులు ఖాతాలో జమ చేసిన, చంద్రబాబు నాయుడుకి చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండలం జొన్న గురుకుల గ్రామపంచాయతీలో రైతులు చంద్రబాబు నాయుడు కి పాలాభిషేకం చేశారు జొన్న గురుకుల సచివాలయం పరిధిలో దాదాపు 300 పైగా రైతులు ఖాతాలో నగదు జమ అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 40లక్షల 50వేల మంది రైతుల ఖాతాలు 3800 పైచిలుక కోట్ల రూపాయలు నగదు, రైతులకు ఆసరా కోసం జమ చేయడం భారతదేశ రాజకీయంలోని ఒక సంచలనమని, ఒక సువర్ణ అధ్యయమని అన్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో రైతులకి నగదు సహాయం చేయకపోగా రైతుల జీవితంతో చెలగాట మాడుకున్నారని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు రైతుబిడ్డ కాబట్టి, రైతు కుటుంబంలో నుంచి వచ్చారు కాబట్టి, రైతు కష్టాలు తెలిసినవారు కాబట్టి, రైతులకి విత్తనాలు అయితే ఏమీ, ఎరువులు అయితే ఏమి, ఇతర అవసరాల నిమిత్తం రైతులకు ఆసరాగా 20వేల రూపాయలు ప్రతి ఏడాది వేయడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా తొలి విడత 7000 రూపాయలు చెప్పిన మాట, చెప్పినట్లుగా రైతుల ఖాతాలో జమ చేసిందని, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుకి పాలాభిషేకం... రైతులకు పట్టాభిషేకం అని ఆనందంతో పాలాభిషేకం చేశారు. భారతదేశ రాజకీయంలోనే ఏ నాయకుడు చేయని విధంగా రైతులకు ఇంత పెద్ద ఎత్తున సహాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఇది రైతు ప్రభుత్వం అని! రైతులు చంద్రబాబు నాయుడు పాలనని కొనియాడారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ కూడా ఇచ్చిన మాట ఇచ్చినట్లుగా! చెప్పిన సహాయం చెప్పినట్లుగా! నెరవేర్చిన చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వాన్ని రైతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధు కుమార్ , రైతు కార్యదర్శి జైపాల్, పార్లిమెంట్ మైనారిటీ కార్యదర్శి షబ్బీర్ భాష, క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గిరిబాబు, టిడిపి బీసీ సెల్ నాయకుడు రామచంద్ర, కిరణ్ కుమార్ , జనసేన నాయకులు అరగొండ మోహన్ బాబు, వెంకటేశ్వర్లు,(చిన్న) దొమ్మరపల్లి కార్తీక్, వంకమిట్ట బాబు, తదితరులు పాల్గొన్నారు

# అరగొండ అర్ధగిరి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం బంధువులు డాక్టర్ శ్రీజ దంపతులు

స్వర్ణసాగరం తవణంపల్లి ఆగస్టు-3



అరగొండ అర్ధగిరి శ్రీ వీరాజనేయ స్వామి దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం బంధువులు డాక్టర్ శ్రీజ దంపతులు కుటుంబ సమేతముగా స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయ సంప్రదాయ పద్ధతిలో తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో అర్ధగిరి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ భవనం వద్ద జడ్పీ నిధులతో నూతన బోరు ప్రారంభం



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగష్టు 3

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పంచాయతీకి చెందిన ఇందిరమ్మ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవనం వద్ద బంగారుపాళ్యం జడ్పిటిసి సోమశేఖర్,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎంబి కుమార్ రాజా,ఎంబి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జడ్పీ నిధులు 4.50 లక్షల యాభైవేలు రూపాయలతొ నూతన బోర్ ను పూజ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, సుబ్రహ్మణ్యం,జగదీష్, మాణిక్యం,నవీన్,ఫిరోజ్ ఖాన్,దేవా,బుజ్జి అంబేద్కర్ యువత నాయకులు పాల్గొన్నారు

# కిషోర్ కుమార్ రెడ్డి ని సన్మానించిన వైకాపా నాయకులు చంద్రారెడ్డి



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 3

రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి గా నియమితులైన చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలానికి చెందిన కిషోర్ కుమార్ రెడ్డి ని గుండ్లకట్టమించి మాజీ సర్పంచ్ బంగారుపాళ్యం మండల వైకాపా నాయకులు చంద్రారెడ్డి తన స్వగృహంలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర సోషయల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు

# మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా ను కలిసిన తమిళనాడు రవాణా మరియు విద్యుత్ శాఖ మంత్రి శివశంకర్

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగష్టు 3



చిత్తూరు జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం బి కుమార్ రాజా నివాసం బంగారుపాళ్యం నందు ఆదివారం తమిళనాడు రవాణా మరియు విద్యుత్ శాఖ మంత్రి ఎస్. ఎస్.శివశంకరన్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ ఎం బి కుమార్ రాజా, మాజీ వైస్ ఎంపిపి హిమాకర్ రాజా,రాష్ట్ర సోషియల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి,బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ కామరాజు, ప్రకాష్ రెడ్డి,మండల యువత అధ్యక్షుడు గజేంద్ర,రఘుపతి రాజు,సాంబయ్య,బాబునాయుడు, తాజ్ ,తిరుమల,పయని,హరి,రవి తదితరులు పాల్గొన్నారు

# బలిజ చేయుత పౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం.




## బలిజ సంఘం ప్రెసిడెంట్ పగడాల శివప్రదీప్.

స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 03.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని బలిజ చేయుత ఫౌండేషన్ ను ప్రారంభించి దాన్ని ద్వారా ఎంతోమందికి అభాగ్యుల కోసం ముందుంటూ ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఆదివారం ఈ సందర్భంగా నాయుడుపేట బలిజ సంగం ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్ ఆధ్వర్యంలో బలిజ సంగం సహాయ కార్యదర్శి హంస పృథ్వీ చంద్ చేతుల మీదుగా ఓజిలి మండలానికి చెందిన పుల్ల హాసిని చదువుకునేందుకు స్కూల్ ఫీజు కట్టలేని స్తోమతలేక ఇబ్బందులు పడుతున్న సమయంలో బలిజ చేయూత ఫౌండేషన్ తెలుసుకొని సుహాసినికి 9వేలు రూపాయలను ఆర్థిక సహాయం చెయడం జరిగింది.ఈ కార్యక్రమం హంస రామారావు,నీలం హరికృష్ణ పాల్గొన్నారు..

# కడుపు నొప్పితో పురుగుల మందు తాగి యువకుడు మృతి

బంగారుపాళ్యం.స్వర్ణ సాగరం.ఆగస్టు 3



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాల్యం మండల పరిధిలోని తుంబపాళ్యం గ్రామానికి చెందిన పవణ్ కళ్యాణ్ 27 సం లు కడుపు నొప్పి తట్టుకోలేక తన పొలం వద్ద శనివారం పురుగులు మందు తాగిపడివుండడంతో తమ కుటుంబ సభ్యులు వేలూరు సి ఎం సి కి తరలించి చికిత్స పొందుతూండగా ఆదివారం మరణించినాడు పవణ్ కళ్యాణ్ తండ్రి పిర్యాదు మేరకు బంగారుపాళ్యం సిఐ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# ఆకతాయి ఆగడాలకు చెక్ నాయుడుపేటబీఅర్బన్ సిఐ బాబి

స్వర్ణసారం (నాయుడుపేట) ఆగస్టు 03.



తిరుపతి జిల్లా నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకతాయిల ఆగడాలను కట్టడి చేసే దిశగా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించిన సిఐ బాబి.పాఠశాలలతో పాటు కళాశాలల వద్ద బాలికలను మరియు మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రధానంగా పట్టణంలో ఆకతాయిల ఆగడాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆకతాయిల ఆగడాలను అరికట్టి బాలికలు మరియు మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపిన సిఐ బాబి.

# స్నేహితుల ఔదార్యం



## స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్ననాటి స్నేహితుడికి ఆర్థిక సహాయం

స్వర్ణసాగరం డోర్నకల్ ఆగస్టు 03

ఆర్థిక పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న స్నేహితుడికి ఆర్థిక సహాయం అందించి స్నేహితులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. డోర్నకల్ మున్సిపాలిటీకి చెందిన ఎస్కే మౌలాలి, ఆర్థిక పరిస్థితులు మరియు నా అనే వాళ్ళు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా చిన్ననాటి స్నేహితుడికి శు భాకాంక్షలు చెప్పేందుకు వెళ్లిన మిత్రులకు అతని ఆర్థిక పరిస్థితిని చూసి చలించిపోయారు.వెంటనే నూతన వస్త్రాలు, మరియు నెలకు సరిపడా రేషన్ సరుకులను మౌలాలి కి అందించారు. స్నేహితులు మహేందర్, జీ.రాజు, సౌడం మహేష్, రామాచారి, ఉన్నాం

# ఎన్ హెచ్ 16 - శ్రీసిటీ కూడలిలో మౌళిక వసతుల అభివృద్ధి

## - పారిశ్రామిక రవాణా బలోపేతం కొరకు గ్రేడ్-సెపరేటెడ్ జంక్షన్ నిర్మాణం

## - ప్రభుత్వం చొరవను ప్రశంసించిన శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ,స్వర్ణ సాగరం ఆగస్టు 03, 2025:

పారిశ్రామిక రవాణా సదుపాయాలను మెరుగు పరిచే చర్యల్లో భాగంగా జాతీయ రహదారి-16 (NH-16) లోని శ్రీసిటీ ముఖద్వారం (ఎంట్రీ పాయింట్) వద్ద దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌళిక వసతుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టు పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపీ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు లు వర్చువల్‌గా పునాది వేశారు. వీటిలో ఫ్లైఓవర్లు, బైపాస్‌లు, రోడ్డు విస్తరణ మరియు ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం ఉన్నాయి. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ మరియు పారిశ్రామిక శక్తి కేంద్రంగా మార్చడం లక్ష్యంగా నిర్దేశించపడ్డాయి. శ్రీసిటీ ఎంట్రీ పాయింట్ వద్ద కీలక మౌళిక సదుపాయాల ప్రాజెక్టులో రూ.45 కోట్ల పెట్టుబడితో 900 మీటర్ల గ్రేడ్-సెపరేటెడ్ జంక్షన్ నిర్మించనున్నారు. ఇది (NH-16 పై




ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్ ప్రవాహాన్ని కొనసాగిస్తోంది. తద్వారా, శ్రీసిటీలోకి ప్రవేశించే, నిష్క్రమించే వాహనాలకు ప్రత్యేక అండర్‌పాస్ సదుపాయం కలుగుతుంది. ఇష్టారాజ్యంగా లింక్ రోడ్ల ద్వారా జాతీయ రహదారిపై ప్రవేశించడం, రోడ్డుపై వాహనాలను ఆపడం వంటి సమస్యలకు 'చెక్ ' పెడుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన అనంతరం శ్రీసిటీ, చెన్నై, నెల్లూరు, కృష్ణపట్నం పోర్టు వంటి కీలక గమ్యస్థానాల మధ్య కనెక్టివిటీని గణనీయంగా పెంచుతుంది. కార్గో ట్రక్కులు, కార్మికుల రవాణా బస్సులకు ఏర్పడే జాప్యాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రస్తుతం, హైవే కూడలి వద్ద భారీ వాహన ట్రాఫిక్ కారణంగా ఆల్‌స్టామ్ మెట్రో కోచ్ ట్రాలీలు, భారీ VRV ట్యాంకులు వంటి పొడవాటి కార్గో వాహనాలు (NH-16 లో ప్రవేశి ంచడానికి తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొ ంటున్నాయి . అదేవిధంగా, శ్రీసిటీలోకి ప్రవేశించే, నిష్క్రమించే ఉద్యోగుల రవాణా బస్సులు గణనీయమైన జాప్యాన్ని చవిచూస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న 'గ్రేడ్ సెపరేటర్' ఈ అడ్డంకులను తొలగిస్తుంది. ఈ అభివృద్ధిని స్వాగతించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, "దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చినందుకు సంతోషంగా ఉంది. ఇది కార్గో ఇతర వాహన రవాణాను చాలా సులభతరం చేస్తుంది. పరిశ్రమలు మరియు ఉద్యోగులకు అత్యంత ప్రయోజనాన్ని చేకూరుస్తుంది" అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీల చురుకైన నాయకత్వంలోని ఈ రాష్ట్రవ్యాప్త మౌళిక వసతుల ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఒక ప్రధాన ముందడుగుగా ఆయన పేర్కొన్నారు. ఇది వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ సామర్థ్యాన్ని విస్తరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కు విస్తృత ఆర్థిక అవకాశాల సృష్టికి సహకరిస్తుందని డాక్టర్ సన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. కాగా, రోడ్డు, రైలు రవాణా అనుసంధానం, సమీపంలో పలు ఓడరేవు సదుపాయాలను కలిగివుండి, ఇప్పటికే శ్రీసిటీ ప్రపంచ తయారీ పరిశ్రమలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. ప్రస్తుతం ఈ మౌళిక సదుపాయాల పెంపు ద్వారా పెట్టుబడి అవకాశాలను మరింత మెరుగుపరచనుంది.

# పేద ప్రజలకు ఉచిత వైద్య సేవ చేయడం జన్మ సుకృతం

## డా" ఎం వెంకటరమణ

స్వర్ణ సాగరం ప్రతినిధి రమేష్ దక్కిలి

డక్కిలిలోని నీరజ్ ప్రథమ చికిత్స కేంద్రం నందు డాక్టర్ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.డక్కిలి మండల పరిసర ప్రాంత ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 200 ల మందికి పైగా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మేజర్ సమస్యలున్న రోగులను తిరుపతి ఆసుపత్రికి ఉచితంగా వైద్య పరీక్షలు మరియు అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించుట కొరకు తిరుపతి శ్రీ రమాదేవి హాస్పిటల్ కు పంపడం జరిగింది. అక్కడ వైద్య పరీక్షల అనంతరం తిరిగి వచ్చుటకు చార్జీలు కూడా ఇచ్చి పంపడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. వెంకటరమణ మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్యం చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని,పేద ప్రజలకు వైద్యం అందించుట కొరకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.అడిగిన వెంటనే రమాదేవి హాస్పిటల్ వారు మా హాస్పిటల్ నందు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినందుకు వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని,భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో వైద్య శిబిరాలను నిర్వహించి పేద ప్రజలకు వైద్యం అందించుటలో ముందుంటానని ఆయన తెలిపారు.




# పుష్కలంగా పచ్చిరొట్ట విత్తనాలు



పెళ్లకూరు స్వర్ణ సాగరం ఆగస్టు 3.

భూసారం పెంపొందించుకోవడానికి రైతులందరికీ పుష్కలంగా పచ్చ రొట్టె విత్తనాలను రాయితీపై పంపిణీ చేసేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య వెల్లడించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం తో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లుకు పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యతను విన్నవించారు. మండలంలోని 24 పంచాయతీలలో సుమారు 5వేల హెక్టార్లు వరి సాగు చేస్తున్నడం వల్ల భూసారం పెంపొందించుకోవడానికి ఎక్కువ మంది రైతులు పచ్చిరొట్ట పైర్ లో సాగు చేస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఐదు టన్నులు పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేసినప్పటికీ మరో పది టన్నులు రైతులకు అవసరం ఉందని విన్నవించారు. స్పందించిన కలెక్టర్ రెండు రోజుల్లో పెళ్లకూరు మండలానికి సమృద్ధిగా పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీరి వెంట పార్టీ నాయకులు మదన్ నాయుడు, సిద్దుల నాయుడు ఉన్నారు.

# స్నేహితుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ యువ నాయకులు అభి



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 3

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలానికి చెందిన జనసేన పార్టీ యువ నాయకులు అభి చిత్తూరు నందు దేవి బాల మందిర్ స్కూల్ నందు అధికేశవులు కుమార్తె డీకే చైతన్య ఆధ్వర్యంలో జరిగిన స్నేహితుల దినోత్సవం సందర్భంగా దోస్త్ టీమ్ వారిచే చేపట్టిన కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ నిత్య బాబు,గంగాధర నెల్లూరు జనసేన పార్టీ ఇన్చార్జ్ యుగేందర్, జనసేన పార్టీ నాయకులు యశ్వంత్,భరత్ తధితరులు పాల్గొన్నారు.

డీకే చైతన్య ఆదికేశవులు మాట్లాడుతూ,పిల్లలకి ఎలాంటి సహాయం కావాలన్న ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి కావలసిన వస్తువులు వారికి కావలసిన ఆర్థిక సహాయం తను అందజేస్తానని తెలిపారు.

# ఆ పోస్టర్‌తో నా కల నెరవేరింది: ఆనంద్ దేవరకొండ



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బేబి'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం 2023 జూలై 13న విడుదలైంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డ్స్‌లో ఈ సినిమాకి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా సాయి రాజేశ్, ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్‌గా పీవీఎన్ఎస్ రోహిత్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చిత్రబృందం మాట్లాడారు. సాయి రాజేశ్ మాట్లాడుతూ– 'బేబి'సినిమాకు ప్రతి ఒక్కరూ హీరోనే... అంతా ప్రాణం పెట్టి పని చేశారు. మాకు వచ్చిన బెస్ట్ స్క్రీన్ ప్లే అవార్డ్ మా ఎడిటర్ విప్లవ్‌కి కూడా చెందాలి. నన్ను ఎవరూ నమ్మని రోజు ఎస్‌కేఎన్ నమ్మినందుకు థ్యాంక్స్" అని చెప్పారు. బేబి సినిమా కోసం టీమ్ మొత్తం ప్రాణం పెట్టి పని చేశాం. మా చిత్రం జాతీయ అవార్డు గెల్చుకోవడం ఆనందంగా ఉంది. నా సినిమా పోస్టర్ మీద నేషనల్ అవార్డ్ విన్నర్ అనే పేరు చూడటంతో నా కల నెరవేరిన అనుభూతి కలుగుతోందని హీరో ఆనంద్ దేవరకొండ తెలిపారు. బేబిలో ప్రేమిస్తున్నా అనే పాటకి బెస్ట్ సింగర్‌గా జాతీయ అవార్డు అందుకోనుండటం సంతోషంగా ఉందని సింగర్ పీవీఎన్ఎస్ రోహిత్ పేర్కొన్నారు. ఈ సినిమాలో నేనూ భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉందన్నారు హీరోయిన్ వైష్ణవి చైతన్య. నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ బేబికి జాతీయ అవార్డులు రావడంతో మరిన్ని మంచి చిత్రాలు చేయాలనే బాధ్యత మాపై పెరిగిందని అన్నారు.



# తమిళ స్టార్ దర్శకులంతా ఒకే ఫ్రేములో.. నెట్టింట వైరల్‌గా మారిన పిక్

ఇటీవల సినీ పరిశ్రమలో రీ యూనియన్ ట్రెండ్ బాగా హైలైట్ అయింది. సీనియర్ నటీనటులు, దర్శకులు కలిసి గత జ్ఞాపకాలను పునరుద్ధాటిస్తూ ఆనందంగా గడిపేస్తున్నారు. ఇటీవల 90ల కాలంలో సూపర్ హిట్స్ అందించిన తమిళ్, తెలుగు నటీనటులు కలిసి రీ యూనియన్ పార్టీ చేసుకున్న సంగతి మనకు తెలిసిందే. తాజాగా, తమిళ్ సినీ పరిశ్రమకు వెలకట్టలేని కృషి చేసిన దర్శకులు ఒకే చోట సమావేశమై ఒక ఫోటో కోసం పోజ్ ఇవ్వగా, ఆ చిత్రాన్ని దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఫోటోలో గౌతమ్ వాసుదేవ్ మీనన్, నెల్సన్ దిలీప్ కుమార్ (ఈ జెనరేషన్‌కు బాగా పరిచితమైన దర్శకుడు), శంకర్ (విజువల్ వండర్స్‌కు కేరాఫ్ అడ్రస్), మణిరత్నం (క్లాసికల్ మాస్టర్‌పీసులకు మారుపేరు), మిస్కిన్ (ఇంటెన్స్ నరేషన్‌కి పేరుగాంచిన దర్శకుడు), లింగుస్వామి (కమర్షియల్ హిట్‌లకు స్పెషలిస్ట్), మురుగదాస్ (పాన్ ఇండియా విజయాల కారకుడు), కేఎస్ రవికుమార్ (సినిమా మాస్టర్, స్టార్ హీరోల ఫేవరెట్ డైరెక్టర్) అందరు కూర్చొని ఫొటోకి పోజులిచ్చారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో షేర్ చేసిన క్షణాల్లోనే వైరల్ అవగా, తమిళ్ ప్రేక్షకులతో పాటు తెలుగు సినీ ప్రేమికులు కూడా వీరందరు ఇలా కలవడం చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. "అందరూ కలిసి ఒకే ఫ్రేమ్‌లో ఉండడం అరుదైన సన్నివేశం", "ఈ ఒక్క ఫోటోలో సుమారు 100 బ్లాక్‌బస్టర్లు దాగున్నాయ్" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ రీ యూనియన్ పార్టీ ఎక్కడ జరిగింది? ఎందుకు సమావేశమయ్యారు అన్నదానిపై స్పష్టత రాకపోయినా, ఈ తరహా మీటింగ్‌లు టాలెంటెడ్ మేకర్స్ మధ్య బంధాన్ని బలపరిచే అవకాశం కల్పిస్తాయన్నది మాత్రం స్పష్టంగా అర్థమవుతుంది.. సినిమా ప్రేమికులకు ఇది నిజంగా ఒక విజువల్ ట్రీట్.

# తెలుగులోకి రాబోతున్న కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రమ్ సో'





చిన్న సినిమాగా విడుదలై కన్నడలో బ్లాక్ బస్టర్ విజయం సాధించిన సినిమా తెలుగులో విడుదల కాబోతుంది. ఈ సినిమా తెలుగు రైట్స్‌ని ప్రముఖ టాలీవుడ్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ దక్కించుకుంది. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపింది. జూలై 25న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తూ, విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. రాజ్ బి శెట్టి సహ–నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రాన్ని జెపి తుమినాడ్ దర్శకత్వం వహించారు. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం, వినూత్నమైన కథాంశంతో కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రం కన్నడలో అరుదైన రికార్డును నమోదు చేసుకుంది. కేవలం రూ.3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటివరకు రూ.28 కోట్ల వరకు వసూళ్లను రాబట్టింది. అంతేగాకుండా కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం 3.80 లక్షలకు పైగా టిక్కెట్లు అమ్ముడై, ఒకే రోజులో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో అత్యధిక టిక్కెట్లు అమ్ముడైన కన్నడ చిత్రంగా రికార్డు సృష్టించింది.




# అప్పుడే ఓటీటీలోకి గాలి జనార్ధనరెడ్డి కుమారుడి సినిమా

మాజీ మంత్రి, ప్రముఖ రాజకీయ నాయకుడు గాలి జనార్దన్ రెడ్డి కుమారుడు కిరిటీ రెడ్డి హీరోగా నటించిన మొదటి సినిమా జూనియర్. దర్శకుడు రాధాకృష్ణ రెడ్డి తెరకెక్కించిన ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లో శ్రీలీల హీరోయిన గా నటించింది. అలాగే కన్నడ నటుడు రవిచంద్రన్, జెనీలియా డిసౌజా కీలక పాత్రలు పోషించారు. జులై 18న కన్నడతో పాటు తెలుగులో ఒకేసారి విడుదలైన జూనియర్ సినిమా ఓ మోస్తరుగా ఆడింది. ముఖ్యంగా ఇందులోని వైరల్ వయ్యారి పాట సోషల్ మీడియాను షేక్ చేసింది. శ్రీలీలతో పాటు కిరిటీ రెడ్డి వేసిన స్టెప్పులు సినిమాలో హైలెట్ గా నిలిచాయి. బాక్సాఫీస్ వద్ద ఓ మోస్తరుగా ఆడిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి రానుంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆగస్ట్ 9 నుంచే ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజానికి ఈ సినిమా ఆగస్ట్ 15 న ఓటీటీలోకి రానుందని మొదట ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు ఒక వారం ముందే స్ట్రీమింగ్ కు రానున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వారాహి చలన చిత్రం బ్యానర్ పై తెరకెక్కిన ఈ సినిమాలో రావు రమేష్, సత్య, వైవా హర్ష, సుధారాణి వంటి ప్రముఖ టాలీవుడ్ నటులు యాక్ట్ చేశారు. అలాగే ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించడం విశేషం.




# వీకెండ్‌లో కింగ్‌డమ్ దూకుడు..

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటించిన కింగ్డమ్ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుపోతుంది. డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ స్పై గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాకు మొదటి నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. భారీ అంచనాల మధ్య జూలై 31న విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ టాక్ అందుకుంది. అలాగే మొదటి రోజే భారీ వసూళ్లు రాబట్టింది. ఇప్పటివరకు విజయ్ కెరీర్ లోనే ఓపెనింగ్ రోజునే భారీ వసూల్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. ఇక ఆ తర్వాత రోజు సైతం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుంది. మొదటి రోజు రూ.39 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టిన ఈ చిత్రం రెండు రోజులకు గానూ రూ.53 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టినట్లు చిత్రయూనిట్ తెలిపింది. తాజాగా కింగ్డమ్ మూవీ మూడు రోజుల కలెక్షన్స్ అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.67 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ వసూలు చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు 53 కోట్ల వరుక థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఇక ఈ ఆదివారంతోపాటు వచ్చే వారం సైతం కింగ్డమ్ వసూళ్లు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో విజయ్ మాస్ యాక్షన్ అదరగొట్టారు. ఇక ఇందులో విజయ్ , సత్యదేవ్ మధ్య వచ్చే సీన్స్ ఆకట్టుకున్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ అందించిన బీజీఎమ్ సినిమాకు హైలెట్ అయ్యింది. ఈ చిత్రంలో విజయ్ జోడిగా భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించి సంగతి తెలిసిందే.